ప్రజాశక్తి
ఆదివారం 14 జులై 2024
5
కర్నూలు

వెళ్లిపోవాల్సిందే...

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండిఎం వర్కర్స్, ఇతర ఉద్యోగులపై అధికార పార్టీ నేతలు ఒత్తిళ్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇన్నాళ్లు ఐదు సంవత్సరాలపాటు గత ప్రభుత్వ హయాంలో ఉన్న గ్రామ స్థాయిలో పనిచేసే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలలో పనిచేసే శానిటరీ కార్మికులు వాచ్‌మెన్లు వెంటనే వారి ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లాలని అధికార పార్టీ నేతలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. తమ అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ఇప్పటికే సంబంధించిన శాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖలను కూడా పంపుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులపై అధికార పార్టీ వేధింపులకు గురి చేయడం పట్ల ఆగ్రహం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవకముందే అప్పుడే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగులను తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగింపుకు సంబంధించి ఇప్పటికే జాబితాను అధికార పార్టీ నేతలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు పంపారు. అలాగే తొలగించిన వారితోపాటు కొత్తగా తమ పార్టీ అనుయాయులకు కట్టబెట్టేందుకు సిఫార్సు కూడా చేస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద పని చేసే వంట ఏజెన్సీ కార్మికులు శానిటరీ వర్కర్స్ నైట్ వాచ్‌మెన్లను తొలగించాలని ఇప్పటికే వారికి అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామా చేసి వెళ్లారా లేకపోతే తామే తొలగింపుకు చర్యలు తీసుకుంటామని అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాజీనామా లేఖలను తీసుకువెళ్లి పాఠశాలలో అధికార పార్టీ నేతలు వారి అందజేస్తున్నారు. లేకపోతే అధికారులకు చెప్పి వారిపై అవినీతి ఆరోపణలు పేరుతో విచారణ చేయించి తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు తీవ్రం కావడంతో అధికారులు కూడా ఏమి చేయలేక రాజీనామాలు చేస్తున్నారు. తక్కువ వేతనాలతో పని చేసిన ఉద్యోగులపై ఇలాంటి కక్ష సాధింపు చర్యలను పాల్పడటంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. అవసరమైతే వారికి కనీస వేతన చట్టం అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

కర్నూలులో కిమ్స్ కడల్స్ సేవలు

- మాతా శిశు సంరక్షణకు మరింత మెరుగైన సేవలు
- పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ సేవల అందుబాటులోకి - ప్రారంభించిన కిమ్స్ సిఎండి డాక్టర్ భాస్కరరావు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఇన్నాళ్లూ హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన కిమ్స్ కడల్స్ ఆస్పత్రి సేవలు ఇప్పుడు రాయలసీమలోని కర్నూలు నగరానికి కూడా తరలివచ్చాయి. కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా అభివృద్ధి చేసిన మాత శిశువు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగం అయిన కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని కిమ్స్ గ్రూప్ సిఎండి డాక్టర్ బొల్లినేని భాస్కరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో ఇది సరికొత్త అధ్యాయమన్నారు. రాయలసీమ ప్రాంతవాసులకు స్త్రీలు, పిల్లల సంరక్షణ విషయంలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించడానికి కిమ్స్ కడల్స్ ఆస్పత్రి కర్నూలుకు వచ్చిందని అన్నారు. ఇక్కడ నియోనాటల్ ఐసియు, పీడియాట్రిక్ కార్డియాలజీ, పీడియాట్రిక్ న్యూరాలజీ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జరీలు కూడా వస్తాయని తెలిపారు. ఇలాంటి ఆధునికమైన సేవలు కావాలంటే ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇక రాయలసీమ వాసులకు కర్నూలులోనే ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు కూడా ఉండటం వల్ల అన్నిరకాల వైద్య పరీక్షలు ఇక్కడే చేయించుకోవచ్చని అన్నారు. ఎలాంటి సంక్లిష్టమైన ప్రసవాల కేసులైనా ఇక్కడి నిపుణులైన వైద్యులు చేస్తారని చెప్పారు. కర్నూలులోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో 30 మందికి పైగా సీనియర్ వైద్యులు, 200 మందికి పైగా సిబ్బంది రోజుకు 24 గంటలూ ఇక్కడి మాతా శిశు సంరక్షణ విభాగంలోని తల్లులు, పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని తెలిపారు. ఇప్పటికే ఇక్కడ నెలకు దాదాపు 60 నుంచి 70 వరకు ప్రసవాలు జరుగుతుండగా, ఇకపై తల్లులు, చంటిపిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సంక్లిష్టమైన సమస్యలకైనా పరిష్కారం దొరుకుతుంది అన్నారు. ఎంఆర్ఐ, సిటిస్కాన్, ఫిజియోథెరపీ, చైల్డ్ డెవలప్‌మెంట్ యూనిట్ (సిడియు) లాంటి అత్యాధునిక పరికరాలు, సేవలు ఉంటాయన్నారు. అత్యంత క్లిష్టమైన ప్రసవాలు కూడా ఇక్కడ చేస్తారని, కవలలు, ముగ్గురు పిల్లలు ఉన్న కేసులు, తరచు గర్భవిచ్ఛిత్తి అవుతున్న కేసులు, మధుమేహం లేదా కాలేయ సమస్యలు ఉన్న మహిళలకు ప్రసవాలు, ఫైబ్రాయిడ్ వల్ల ఇబ్బంది అవుతున్నా, రక్తహీనత ఉన్నా, ఒవేరియన్ సిస్టులు ఉన్నా, కిడ్నీ వ్యాధులు ఉన్నా ఐవిఎఫ్ కేసులు, కిడ్నీ మార్పిడి చేయించుకున్న మహిళలకు క్లిష్టమైన ప్రసవం లాంటివి ఇక్కడ చేస్తారని అన్నారు. రీజనల్ హెడ్ కిశోర్ రెడ్డిఎన్ఐ, సిఒఒ డాక్టర్ సునీల్, వైద్యనిపుణులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ రఫీక్ అహ్మద్, డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ వెంకట శెట్టి, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, డాక్టర్ శిల్ప, డాక్టర్ కుసుమ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్వేతా రాంపల్లి, డాక్టర్ మహ్మద్ ఫరూఖ్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సిఎమ్‌డి బొల్లినేని భాస్కరరావు

గెజిట్ పత్రాలను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు సురేష్, తదితరులు

జిపిఎస్ గెజిట్‌ను నిలిపేయాలి

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ గెజిట్ పత్రాలు దహనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం జిపిఎస్ అమలుకు సంబంధించి విడుదల చేసిన గెజిట్ ను వెంటనే నిలుపుదల చేయాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. అమలు చేయకపోతే మరో పోరాటానికి సంసిద్ధం అవుతామని ఆయన హెచ్చరించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో జిపిఎస్ అమలుకు సంబంధించిన గెజిట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, నవీన్ పాటి మాట్లాడారు. 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరికి జిపిఎస్ లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ ఉపాధ్యాయులు మోసపుచ్చుటమేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజ పత్రాన్ని రద్దు చేయాలని తక్షణం పాత పెన్షన్‌ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ద్వారా ఎపాయింట్ అయిన ఉపాధ్యాయులందరిని తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా గత ప్రభుత్వం లాగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఎస్ జిపిఎస్ కాకుండా ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహాధ్యక్షులు హేమంత్ కుమార్, ట్రెజరర్ యెహోషువ, రాష్ట్ర కౌన్సిలర్ రాజు, జిల్లా కార్యదర్శి ఎటి.తిమ్మన్న, నరసింహ, సురేష్, రంగన్న, సురేష్ బాబు రామకృష్ణ, రాముడు, శ్రీనుహనుమంతు, రాముడు, రామకృష్ణ పాల్గొన్నారు.

టిడిపి నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

డోన్ నియోజకవర్గం, ప్యాపిలి మండలం, పోతుదొడ్డి మాజీ సర్పంచ్ రంగనాయకులు, వారి కుటుంబ సభ్యులపైన స్థానిక వైసిపి నాయకులు మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వైసిపి నాయకుల చేతిలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగనాయకులు, వారి కుటుంబ సభ్యులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి ఎర్రసాని నాగేశ్వరరావు యాదవ్ పరామర్శించారు. టిడిపి అండగా ఉంటుందని భయాందోళనలకు గురి కావలసిన అవసరం లేదని వారికి ధైర్యం చెప్పారు.నియోజకవర్గం లో వైసిపి నాయకుల అరాచకాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ బదిలీ

- నూతన ఎస్‌పిగా జి.బిందు మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న జి.కృష్ణకాంత్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నుంచి జిఒఆర్‌టి నెంబర్ 1252ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐపిఎస్ లను బదిలీ చేస్తూ ఆదేశాలను జారీ చేశారు. అందులో భాగంగా జి.కృష్ణకాంత్ ను నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన స్థానంలో 2017 ఐపిఎస్ బ్యాచ్ కు చెందిన జి.బిందు మాధవ్‌ను నూతన ఎస్‌పి నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తుంగభద్ర డ్యామ్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

- 32 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లోన్ తగ్గింది. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు రోజుకు 50 వేల నుంచి 37 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో 11400 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోయినట్లు బోర్డు అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 32 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈ రెండు, మూడు రోజుల్లో రుతుపవనాల కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గతే డాది జూన్, జులై నెలల్లో ఎలాంటి ఇన్‌ఫ్లో ఉండేది కాదు. ఈఏడాది జులై నెలలో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి నీరు చేరే అవకాశా లు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్, ఎల్ఎల్‌సి కాలువపై ఆధారపడి న రైతులు తమ పొలాల్లో దుక్కు దున్నులు మొద లుపెట్టారు. గతేడాది వర్షాల్లేక బెంగళూరు, ముంబ యి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగితే ఈనెల చివరిలో లేదా ఆగస్టు మొదటి వారంలో ఎల్ఎల్‌సికి నీరు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కొనాల్సిందే...!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి ప్రభుతం, నాయకులు చెబుతున్నట్లు ఇసుక ఉచితంగా లభించడం లేదు. డబ్బులు పెట్టి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిందే. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుర్తించిన ఏకైక ఇసుక రీచ్ కౌతాళం మండలం గుడికంబాలిలో టన్ను ఇసుకను అధికారులు దగ్గరుండి రూ.335 ప్రకారం విక్రయిస్తున్నారు. 4 టన్నులు పట్టే ట్రాక్టర్ ఇసుకకు రూ.1340, 18 టన్నులు పట్టే టిప్పర్ ఇసుకకు రూ.6,030 చెల్లించి వినియోగదారులు తమ ఇళ్ళ,, ఇతర నిర్మాణాలకు తరలిస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన భవన నిర్మాణదారులకు మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండలం గుడికంబాలిలో మాత్రమే రీచ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ దాదాపు 29వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. టిప్పర్‌లో 18 టన్నుల ఇసుక పడుతుండడంతో రూ.6,030, ట్రాక్టర్‌లో 4 టన్నుల ఇసుకను తరలించేందుకు అనువుగా ఉండడంతో రూ.1,340 చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వంలో కౌతాళంకు గుడికంబాలి నుంచి ట్రాక్టర్ ఇసుకను తీసుకెళ్లేందుకు రూ.4వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం రవాణా ఛార్జీలతో కలిపి దాదాపు అదే మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. కర్నూలు నుంచి గుడికంబాలి 131 కిలో మీటర్ల దూరంలో ఉంది. టిప్పర్ ఇసుక కోసం అక్కడికి వెళితే రవాణా ఛార్జీలు దాదాపు రూ.26 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఇసుక ధర రూ.6,030 అదనం. ఈ నేపథ్యంలో కర్నూలు వాసులు టిప్పర్ ఇసుక తెచ్చుకోవాలంటే రూ.32 వేలు చెల్లించక తప్పని పరిస్థితి. ప్రస్తుతం గుడికంబాలిలో మాత్రమే ఇసుక లభిస్తుండడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలకు చెందిన భవన నిర్మాణదారులు అక్కడికి వెళ్లాల్సిందే. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.20 వేల ఖర్చు చేయాల్సి ఉంటుంది. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలకు చెందిన భవన నిర్మాణదారులకు రవాణా ఛార్జీలతో కలుపుకొని టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు వస్తోంది. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, పాణ్యం నియోజకవర్గాలకు చెందిన వారు టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 నుంచి రూ.40 వేల వరకు చెల్లించాల్సిందే.

జ్వరాల భయం : సీజనల్ జ్వరాలు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. వ్యాపిస్తున్న జ్వరాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. డెంగీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం దోమల ద్వారా, చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రెయినేజీలు, మురుగు గుంటల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. దోమల వ్యాప్తి పెరిగి డెంగీ విజృంభిస్తోంది. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడం, డ్రెయినేజీ కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి.

టిడ్కో ఇళ్లు ఏం చేస్తారో ? : పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. పూర్తయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



500 మందికి యురాలజీ శస్త్రచికిత్సలు చేసిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది

500 మందికి పైగా లేజర్ యురాలజీ శస్త్రచికిత్సలు

విజయవంతంగా నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్స్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాయలసీమలో 500మందికి పైగా లేజర్ యురాలజీ శస్త్ర చికిత్సలు కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో విజయవంగా నిర్వహించారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్‌రెడ్డి యురాలజీ విభాగం వైద్యులను అభినందించారు. డాక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం కిడ్నీలో రాళ్లకు శస్త్ర చికిత్స చేయాలంటే కీహోల్ ద్వారా చేయాల్సి వచ్చేదన్నారు. ఇందులో అధిక రక్తస్రావం జరగడం కిడ్నీ పనితీరు తగ్గడం జరిగేదన్నారు. ఇప్పుడు అత్యాధునిక టెక్నాలజీ హోల్మియం లేజర్ ద్వారా కిడ్నీలో రాళ్లను కోతకుట్టు లేకుండా కీహోల్ లేకుండా తొలగించడానికి వీలవుతుందన్నారు. ఇందులో నొప్పి, రక్తస్రావం ఉండవు కాబట్టి రెండవ రోజు నుంచే అన్ని పనులు చేసుకోవచ్చు. ఈ లేజర్ ద్వారా కిడ్నీలో రాళ్ల మాత్రమే కాకుండా మూత్రాశయంలో కణతులు , ప్రోస్టేట్ గ్రంధిని కోత కుట్టు లేకుండా తొలగించవచ్చని తెలిపారు. వేరికోసెల్‌తో బాధపడుతున్నా ఈ యొక్క అధునాతన మైక్రోస్కోపిక్ వెరికోసెల్ సర్జరీతో తక్కువ నొప్పి, త్వరగా రికవరీ, లాపరోస్కోపిక్ అండ్ ఓపెన్ సర్జరీ కంటే మెరుగైన ఫలితం పొందవచ్చన్నారు. వృషణానికి , బీజానికి ఎటువంటి గాయం లేకుండా ఆపరేషన్స్ ,సంతానలేమిలో మంచి ఫలితాలు ఈ మైక్రోస్కోపిక్ చికిత్స ద్వారా మనం పొందవచ్చని అన్నారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు , 24/7 అనుభవజ్ఞులైన డాక్టర్స్ ద్వారా ఇటువంటివి సాధ్యపడుతున్నాయని అన్నారు. రాయలసీమలోనే 500 మందికి పైగా లేజర్ యురాలజీ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన మొట్టమొదటి హాస్పిటల్స్ - మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు అని తెలిపారు. యూరాలజీ విభాగం డాక్టర్స్‌ను అభినందించారు.

15న ప్రజా సమస్యలు పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 15న సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గర్భిణీల ఆరోగ్యాన్ని పరిరక్షించండి

డిఎంహెచ్‌ఒ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం శరీన్ నగర్ లోని సవారి తోట , ఐటి సి కంపెనీ సచివాలయాలలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు , రిపోర్ట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్ల లోపు పిల్లలకు ఇవ్వవలసిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలన్నారు. ఆ వివరాలను ఎంసిపి కార్డు నందు నమోదుచేసి ఎప్పటికప్పుడు ఆర్‌సి హెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. దీనివలన పిల్లలను వ్యాధుల బారినుండి కాపాడ వచ్చునని తెలిపారు. గర్భవతులను 12 వారల లోపు నమోదుచేసుకొని సమయానుసార ఆరోగ్య సేవలు అందించాలని , వారు కాన్పుకు వెళ్ళవలసిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆవివరాలను ఎఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల ఒకటి నుండి ఆగస్టు 31 వరకు జరగబోయే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యుపిహెచ్‌సిలు , విలేజ్ హెల్త్ క్లినిక్ , అంగన్వాడీ సెంటర్‌లో తప్పనిసరిగా ఒఆర్ఎస్,జింక్ మాత్రలను అందుబాటులో ఉంచుకొని డయేరియా వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు తమ పరిధిలో గృహ సందర్శనలు చేసి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటిలోనూ ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం - ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమం లో భాగంగా ఇద్దరు ఆడపిల్లలు గల తల్లిని సన్మానించారు. ఆడ పిల్లలపై వివక్ష చూపకుండా పాపైనా బాబైనా సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి శరీన్ నగర్ వైద్యాధికారి డాక్టర్ పర్వీన్ తబుస్సుమ్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖరరెడ్డి ,మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు ఆడపిల్లల తల్లిని సన్మానిస్తున్న డిఎంహెచ్‌ఒ

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూలుకు రక్షణ గోడ నిర్మించాలి

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు అబూబక్కర్ మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. దాదాపు 300 మంది పైగా విద్యార్థులు చదువుతున్న రెసిడెన్షియల్ పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలన్నారు. రక్షణ గోడ లేకపోవడం వల్ల చుట్టుపక్కల ఉన్న అల్లరి మూకలు విద్యార్థుల హాస్టల్ లోకి వచ్చి ఇబ్బంది కలిగించే అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. చదువుకోడానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, లేకుంటే విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి మల్లేష్ , ఆర్యన్ నగర కమిటీ సభ్యులు ఎల్లక్రిష్ణ పాల్గొన్నారు.

కెసి కెనాల్‌ను శుభ్రం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ప్రవహిస్తున్న కెసి కెనాల్ శుభ్రం చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వైఖరి విడనాడాలని సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ ,నగర కార్యదర్శివర్గ సభ్యులు కె .రామకృష్ణ ,డి.అబ్దుల్ దేశాయ్, ఆర్.కృష్ణ కెసి కెనాల్ వినాయక ఘాట్ పరిసర ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా స్థానికంగా నివాసం ఉండే ప్రజల బాధను వెళ్ళగక్కారని పత్రిక ముఖంగా తెలిపారు. కేసి కెనాల్ కర్నూలు కడప రైతులకు పొలాలకు నీరు అందించే కాలువ. కర్నూలు నగరంలో వివిధ కాలనీలలో నుండి మురుగునీరు కేసి కెనాల్‌లో చేరి షిల్ట్ పేరుకొనిపోయిందన్నారు. గుర్రపు డెక్క పర్చుకుపోయి మురుగు నీరు సాఫీగా కిందికి ప్రవహించే పరిస్థితి లేదన్నారు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి దుర్గంధ భరితమైన వాసనతో కెనాల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిస్థితి ఉందని తెలిపారు. మురుగు నీరు కెసి కెనాల్‌లో నిలిచిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, కర్నూలు ప్రజలు దోమ కాటుకు గురై మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. చాలా మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలకులకు సిపిఎంగా అనేక పర్యాయాలు గుర్తుచేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన టిడిపి పాలకులయినా ప్రజల బాధలు తెలుసుకొని వారి కష్టాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్ తేజ, జలమండలి అధికారులతో చర్చించి కెసి కెనాల్‌ను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం కార్యకర్తలు ఆర్ చంద్ర ,కె.రాజశేఖర్, పుల్లయ్య, మూస తదితరులు పాల్గొన్నారు.

కెసి కెనాల్‌లో పెరిగిన గుర్రపుడెక్కను చూపుతున్న సిపిఎం నాయకులు

మరో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు కృషి

-9వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించిన టిజి వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ అభివృద్ధితోపాటు మరో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ అన్నారు. కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటుచేసిన 9వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. టిజి వెంకటేష్ మాట్లాడుతూ 1974లో తాను కర్నూలుకు వచ్చిన కొత్తలో స్విమ్మింగ్ పూలు నిర్మాణం జరుగుతున్న సమయంలో సహకరించానని అన్నారు. స్విమ్మింగ్ పూల్ లో జరిగిన ప్రతి అభివృద్ధిలో తన భాగస్వామ్యం ప్రత్యక్షంగా పరోక్షంగా ఉందని అన్నారు. కర్నూలు నగరంలోని స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ రాష్ట్రంలోనే అత్యుత్తమ అసోసియేషన్‌గా కార్యక్రమాలను నిర్వహిస్తుందని కొనియాడారు. ప్రస్తుతం జరుగుతున్న పోటీలకు సంబంధించి బహుమతుల ప్రధానానికి అయ్యే రూ.50 వేల రాష్ట్ర మంత్రి టిజి.భరత్ పేరు మీద తాను అందజేస్తానని తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కర్నూలు నగరంలో రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ ,రాష్ట్ర మంత్రి టిజి.భరత్ క్రీడలకు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ప్రవీణ్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహయ్య, రామకృష్ణయాదవ్ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

ఎపి అంగన్‌వాడి వర్కర్స్ వెల్దుర్తి ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -వెల్దుర్తి

ఎపి అంగన్వాడి వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు ఎస్ చాందిని, ఎఐటియుసి వెల్దుర్తి మండల అధ్యక్షులు బి.మాధవస్వామి ఆధ్వర్యంలో వెల్దుర్తి అంగన్వాడి ప్రాజెక్టు కమిటీ ని శనివారం ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలుగా సంధ్యారాణి ఉపాధ్యక్షులు గా శాంత, యశోద ప్రధాన కార్యదర్శిగా సుజాత సహాయ కార్యదర్శులుగా నాగమద్దమ్మ, రేణుక ట్రెజరర్ గా సి భాను కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జె. లలితమ్మ మాట్లాడుతూ ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను , గుమ్మడి సంధ్యారాణి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి అంగన్వాడి వర్కర్ల సమస్యలను వివరించామని తెలిపారు. వారు త్వరలోనేసమస్యలను పరిష్కరిస్తామన్నారని అన్నారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న

ప్రజాశక్తి - ఆదోని

భూసమస్యను సామరస్యంగా పరిష్కరించుకోకుండా హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడం దారుణమని తెలిపారు. ఈ హత్యకు పాల్పడిన అగ్రవర్ణాలకు చెందిన రాఘవేంద్ర, రెడ్డి, శ్రీధర్ రెడ్డితోపాటు మరో ఇద్దరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ధీమాతో దళిత మహిళపై ఇలాంటి దారుణానికి ఒడికట్టడం సరైంది కాదన్నారు. ఇలాంటి హత్యలను రాష్ట్ర ప్రభుత్వం ఖండించాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. నియోజకవర్గంలో భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, గత రెవెన్యూ అధికారుల వైఫల్యమే కారణమని విమర్శించారు. భూ సమస్యలు ఎక్కడున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని పరిష్కరించాలని కోరారు. హత్యలు, గొడవలు జరగకుండా ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యలు పరిష్కరించే విధంగా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్, తిప్పన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, పట్టణ నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, మండల నాయకులు పరమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

విరమణ పొందిన ఉపాధ్యాయులు వి.శ్రీనివాసులు, ఎన్.రామయ్యను ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.నాగేంద్రప్ప అధ్యక్షతన ఆదోనిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విరమణ అనేది ప్రతి ఉద్యోగికీ సర్వసాధారణమన్నారు. విధినిర్వహణలో వారు చూపిన నీతి, నిజాయితీ వారిని ఆదర్శంగా నిలుపుతాయన్నారు. ఎస్‌టియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, ఐ.రామ్మోహన్ రెడ్డి, వి.రమేష్ నాయుడు, జి.వీరచంద్ర యాదవ్, వెంకటస్వామి, చిరంజీవి రెడ్డి, లోక్య నాయక్, కాశీ విశ్వనాథ్ శాస్త్రి, నరసింహులు, కె.రవి, శ్రీనివాసులు, నాగ ప్రసాద్, అయ్యప్ప, నూర్ అహ్మద్, గౌస్, రాజా సతీష్, మారయ్య, నారాయణ, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై
కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఆదోని

బాధితుని పరామర్శిస్తున్న నాయకులు

డప్పు కళాకారుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, పట్టణ కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డప్పు కళాకారుడు లక్ష్మన్నను కెవిపిఎస్ నాయకులు పరామర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని పట్టణంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన డప్పు కళాకారుడు లక్ష్మన్న శుక్రవారం రాత్రి పీర్ల పండగ సందర్భంగా డప్పు కొడుతుండగా బోయ శేఖర్, బోయ బుడ్డ కృష్ణ కులం పేరుతో దూషించి కట్టెలతో దాడి చేయడం దారుణమన్నారు. దళితులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలను అధికార యంత్రాంగం అరికట్టాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు మునిస్వామి, కృష్ణమూర్తి, పరమేష్, ప్రజా సంఘాల నాయకులు గోపాల్, లింగన్న, తిప్పన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే పార్థసారథికి ఎడ్యుకేషన్ సెక్రటరీలవినతి

ప్రజాశక్తి - ఆదోని

వార్డు సచివాలయాల ఎడ్యుకేషన్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శనివారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు హిమబిందు, రామచంద్ర రావు, ప్రభాకర్, రాజశేఖర్ మాట్లాడారు. కంప్యూటర్ పరిజ్ఞానమున్న వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, విద్యాశాఖలో కంప్యూటర్ అధ్యాపకులుగా నియమించే విధంగా పరిశీలించాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానమున్న ఇతర శాఖలకు అనుసంధానం చేస్తూ పదోన్నతిని కల్పించాలని, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రాష్ట్రస్థాయి సమస్య అయినందున శాసన సభలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు విరా, అనిత, శ్రీమాన్ పాల్గొన్నారు.

46 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు కృషి

- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

హంద్రీనీవా ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు ద్వారా మండలంలోని 46 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఐక్యతతో కృషి చేద్దామని అఖిలపక్ష నాయకులు తెలిపారు. శనివారం దేవనకొండ ఎఫ్ఆర్ హైస్కూల్‌లో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాశక్తి విలేకర్ ఖాసీం, వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, తెలుగు యువత అధ్యక్షులు రాజా సాబ్, టిడిపి యువ నాయకులు బాలు, మజీద్, జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ జగదీష్, కన్వీనర్ వీరేష్, జనసేన నాయకులు రామాంజనేయులు, రాజు, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి నరసారావు, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, రైతుసంఘం, ప్రజాసంఘాల నాయకులు యూసుఫ్ బాష, తెర్నేకల్ బజారి, నల్ల చెలిమల బజారి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షులు రాజా సాబ్

కాలువలు, చెరువుల స్థిరీకరణ పనులు చేపట్టాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

మండలంలోని చెరువులకు, పంట కాలువలకు స్థిరీకరణ పనులు చేపట్టాలి. ఈ పనులు చేపట్టినప్పుడే పొలాలకు సాగు నీరు అందుతుంది. కరివేముల - తెర్నేకల్లు గ్రామాల మధ్యలో, కప్పట్రాళ్ల గ్రామ సమీపంలో పెండింగ్ కాలువ పనులు పూర్తి చేయాలి.

నిధుల కేటాయింపు జరగాలి

- సిపిఐ మండల కార్యదర్శి నరసారావు

హంద్రీనీవా కాలువల నిర్మాణ పనులకు పాలక ప్రభుత్వాలు నిధులు కేటాయించినప్పుడే పూర్తవుతాయి. అధికారికంగా ప్రతి ఎకరాకూ సాగునీరందడం లేదు. అనధికారికంగా రైతులు వ్యయ ప్రయాసాలకు గురై నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించుకుంటున్నారు.

సాగునీటి కోసం ఐక్య పోరాటాలు

- వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు

హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు ద్వారా మండలంలో ప్రతి ఎకరాకూ సాగునీరందేలా ఐక్యతతో పోరాడదాం. హంద్రీనీవా సాగునీటి సమస్యలను పాలకులు, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్దాం.

చెరువుల్లో పూడికతీత పనులు

- తెలుగు యువత ఆలూరు అధ్యక్షులు రాజా సాబ్

దేవనకొండ గ్రామానికి చెందిన రెండు చెరువుల్లో పూడికతీత పనులు చేసినప్పుడే కాలువల ద్వారా నీటిని నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. దీని ద్వారా రైతుల బోర్లలో నీటి శాతం పెరుగుతుంది. టిడిపి ప్రభుత్వం ద్వారా అందరి సహకారంతో ఈ పనులు చేసేందుకు చర్యలు చేపడతాం.

సమస్యల పరిష్కారానికి కృషి

- జనసేన మండల నాయకులు జగదీష్

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం. పంట కాలువల నిర్మాణ పనుల గురించి సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

పట్టణాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నివాసం వద్ద వైసిపి కౌన్సిలర్లు 5వ వార్డు అమానుల్లా, 7వ వార్డు ఎరుకల సూరి, 11వ వార్డు గట్టు రఫీక్, 15వ వార్డు ఇస్సాక్, 23వ వార్డు చంద్రమోహన్ రెడ్డితో పాటు 29వ వార్డు రజితమ్మ, వార్డు మెంబర్లు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టిడిపి పరిశీలకులు శ్రీరాములు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడారు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో పేరుకు మాత్రమే కౌన్సిలర్లుగా ఉంటూ వార్డుల్లో అభివృద్ధి చేయలేక దిష్టిబొమ్మల్లా ఉన్నామని తెలిపారు. కనీసం ఇప్పుడైనా తమను నమ్ముకొని ఓట్లు వేసిన వార్డు ప్రజలకు చేతనైనంత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేసిన ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ కోరారు. ఇటీవల విరమణ పొందిన ఉపాధ్యాయులు కె.భాస్కర్ బాబు, ఎస్.బెల్వాజర్, కె.లవను శనివారం స్థానిక వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్.నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం విద్యారంగం పట్ల అవలంబించిన విధానాల వల్ల సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత చర్యలు, అసంబద్ధ విధానాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని తిరోగమనం వైపు నడిపించాయని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతామని, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జిఒ 117ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకారం అందించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున హామీ మేరకు ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1-5వ తరగతులను ప్రాథమిక విద్య పరిధిలో, 6-10వ తరగతులను, 6-12వ తరగతులను సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని తెలిపారు. విద్యార్థి, తల్లిదండ్రుల అభీష్టం మేరకు మాధ్యమాన్ని ఎంపిక చేసుకొని చదువుకునే అవకాశాన్ని కల్పించాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు కార్యక్రమం బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లను తప్పించాలని కోరారు. నూతన మెగా డీఎస్సీని నిర్వహించి, నియామకాలు చేపట్టేలోపు ఉపాధ్యాయులకు ప్రమోషన్లు చేపట్టి, బదిలీలు నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, పిఆర్‌సి అమలయ్యే వరకు మధ్యంతర భృతిని చెల్లించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శులు నరసింహులు, దేవపాల్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న, వై.రామాంజనేయులు, మండల బాధ్యులు ఎం.రాజు, పరిగె ప్రకాష్, అల్లాబకాష్, లతీఫ్, యు.చంద్రపాల్, ప్రశాంత్, భూపాల్, శివకుమార్, ప్రసాద్, గురుస్వామి, నీలి నాగరాజు, లక్ష్మన్న, రంగన్న, జి.బాబు, మల్లారి నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్ కుమార్

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

వ్యాపారవేత్త మృతికి మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన వ్యాపారవేత్త యుటి.శంకర్ నాథ్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి శనివారం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ యుకె.రాజశేఖర్ ఉన్నారు.

GENERAL NOTICE

In the Court of the Hon'ble Principal Civil Judge (Senior Division) at Kurnool.

I.P. No. 53/2023

Mulla Mastan Vali ... Petitioners/Debtor

Vs

C. Satish and 24 others .... Respondents/Creditors

కర్నూలు జిల్లా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా కర్నూలు సిటి, గణేష్ నగర్‌లోని జంపాల అపార్ట్‌మెంటు దగ్గరగల ఇంటి నెం. 87/1104-4-6-22 నందు నివాసం వుంటున్న ముల్లా మహబూబ్ గారి కుమారుడు ముల్లా మస్తాన్‌వలి పై కోర్టు యందు తనను దివాలా దారునిగా ప్రకటించమని కోరి పైన తెలిపిన కోర్టు యందు I.P. దాఖలు చేసియున్నారు. సదరు కేసుపైన ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల **తేది 07-08-2024న ఉదయం 10:30 గంటలకు** పై కోర్టు యందు మీరు స్వయంగా గాని, మీ తరుపున వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు
కె. సుధాకర్
పిటిషన్ తరుపున న్యాయవాది,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.P. No. 8/2023

1) Arshit Vittal
2) C. Ashok ... Petitioners

Vs

G. Chinna Swamy@Thimmappa and others .... Respondents

Notice to R2, R8

2) ఎన్. అశోక్, తండ్రి నాగప్ప, ఇ.నెం. 49-ఎ-228, మద్దూర్ నగర్, కర్నూలు.

8)కె. శేఖర్, తండ్రి తిపన్న, ఇ.నెం. 76-97-165-32, వీకర్ సెక్షన్ కాలనీ, కర్నూలు.

పై నెంబర్ I.A.లో అర్జీదారులైన 1) అర్షిత్ విఠల్, తండ్రి ఎ. క్రిష్ణ, 2) సి.అశోక్, తండ్రి ఎ. క్రిష్ణ ఇ.నెం. 81-259-ఎ, రామచంద్రానగర్, కర్నూలు అనువారు తమను దివాలాదారులుగా తీర్మానించమని కోరుతూ, దివాలా అర్జి దాఖలు చేసినారు. ఇందులో 2,8 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న 19-07-2024 వ తేది పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

బి. మురళిమనోహర్
బి. భావన,
ఎన్.సి. రామదాస్,
అర్జీదారుల పరం అడ్వకేట్స్, కర్నూలు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE, KURNOOL.

I.A. No. 454/2023 in O.S. No. 224/2016

1) B. Madhu Babu + Another ... Petitioners/Plaintiff

Vs

1) T. Narasimhulu + Others .... Respondents/Defendants

Notice to R4 to 7 and R 11 Under order 1 Rul 10CPC

-R4 Jamalanna, S/o. Late Pedda Venkataiah (R/o Dhone Mandal, Kurnool Dist.
-R5 Narasimhulu,S/o.Late Pedda Venkataiah
-R6 Venkata Lakshmamma, D/o. Late P. Venkataiah (R5 & R6 are Resident of Kurnool City)
-R7 Padmavathi W/o. Maddiah
-R11 Visalakshmi D/o. Madhava Swamy (R/o. R7 and R11 are Resident of E. Thandrapadu (V) Kurnool Mandal.)

పై నంబరు గల దావాలో అర్జీదారు ఆస్తుల విభాగాల కొరకు ప్రతివాదుల పై దావా దాఖలు చేసియున్నాడు మరియు I.A. 454/2023 పిటిషన్‌లో R4 to R7 and R11 implead చేయమని పిటిషన్ file చేసియున్నారు. వాయిదా 24-7-2024వ తేది ఉదయం 10:30 ని॥లకు హాజరుకావలయును లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పిటిషనర్ తరుపున న్యాయవాది
సి. ప్రభాకర్ రెడ్డి
అర్జిదారు పరం న్యాయవాది,
కర్నూలు

మహారాజశ్రీ ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కర్నూలు

ఓ.ఎస్. నెం. 6/2023

దాసరి సుధాకర్ & ఇతరులు. .... అప్పెలెంట్లు/థర్డ్ పార్టీలు

యెదురు

చాకలి హైమవతి & ఇతరులు ... రెస్పాండెంట్లు

5వ రెస్పాండెంట్ కు అప్పీలు నోటీసు

5వ రెస్పాండెంట్: చాకలి సుంకన్న, తండ్రి వెంకటస్వామి, ప్యాలకుర్తి గ్రామము, కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా.

పైన పేర్కొన్న అప్పీలు దావాను, అప్పెలెంట్లు కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జికోర్టు వారు తేదీ : 27.5.2020 న ఓ.ఎస్ నెంబర్ 368/2011 నందు వెలువరించిన తీర్పును ఆక్షేపిస్తూ పైఅప్పీలు దాఖలు చేసి ఉంటున్నారు. అందులో 5వ రెస్పాండెంట్ అయిన నీకు కోర్టు ద్వారా నోటీసులు ముట్టనందున, కోర్టు వారి ఉత్తర్వులమేరకు, ఈ ప్రకటన ద్వారా తెలియచేయడ మేమనగా, సదరు అప్పీలు, **తేదీ: 29/08/2024 పగలు 10:30 గం॥లకు** నీ హాజరు కొరకు వాయిదా వేయబడి ఉంటున్నది. కావున సదరు కోర్టులో హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలయును. లేనియెడల పైఅప్పీలును, నీ పరోక్షములో విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

దావా తేదీ : 29-08-2024
సమయం : 10:30 గంటలకు

ఇట్లు
జి. చలపతి రావు
యం. జాఫర్ హుస్సేన్ బేగ్
ఏ. అనిల్ కుమార్
వాది పరం అడ్వోకేట్స్,
కర్నూలు.
9866627781/9441733438/9849202963.

ఘనంగా వరదేంద్ర తీర్థుల ఉత్తరారాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీవరదేంద్ర తీర్థుల ఉత్తరారాధనను ఘనంగా నిర్వహించారు. శనివారం మహారాష్ట్ర రాష్ట్రంలోని పుణెలోని శ్రీవరదేంద్ర తీర్థుల మఠంలో ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వసంతోత్సవం నిర్వహించి శ్రీవరదేంద్ర తీర్థుల మహా రథోత్సవాన్ని ప్రారంభించారు. పుణెలోని లక్ష్మీ రోడ్డు ఎమ్మెల్యే రవీంద్రధంగేకర్ పాల్గొని పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. అంతకు ముందు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవరదేంద్ర తీర్థ మూల బృందావనానికి మహా మంగళ హారతులు ఇచ్చారు.

పీర్ల పండగలో సౌసన్‌కు అనుమతి లేదు : సిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

పీర్ల పండగ సందర్భంగా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లకు పూజలు మాత్రమే చేయాలని, సౌసన్ ఆడేందుకు అనుమతి లేదని సిఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వలగొండ గ్రామంలో గతేడాది గొడవ జరగడంతో ఈసారి పీర్లు పెట్టడానికి అనుమతి లేదన్నారు. ఆస్పరితో పాటు బిల్లేకల్లు, ముత్తుకూరు, కారుమంచి, చిరుమాన్ దొడ్డి, హలిగేర గ్రామాల్లో సౌసన్ ఆడడానికి అనుమతి ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో సౌసన్ ఆడినట్లు తెలిస్తే డప్పు కొట్టిన, ఆడిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. పీర్ల పండగలో గొడవలు పడినా, గొడవలు సృష్టించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సౌసన్ ఆడకూడదని గ్రామాల్లో దండోరా కూడా వేయించామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైసిపి కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం పెద్దకడబూరులో వైసిపి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని చోట్లా వైసిపిపై దాడులు జరుగుతున్నా, మంత్రాలయం నియోజకవర్గంలో ఎక్కడా అలాంటి పరిస్థితి లేదంటే ప్రజలు వైసిపి వైపు ఉన్నారని తెలిపారు. తాను పార్టీ మారుతానన్న వార్తల్లో నిజం లేదన్నారు. ఆరు నెలల తర్వాత ప్రజా ఉద్యమాలతో టిడిపి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాటాలు చేద్దామని తెలిపారు. టిడిపి నాయకులు మాధవరం రాఘవేంద్ర రెడ్డి ఎన్నికల వరకే వాల్మీకులను ఉపయోగించుకున్నారని, ఇప్పుడు ఆర్థిక సంపాదనే ధ్యేయంగా పని చేస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాల మద్దతు తమకే ఉందని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, రఘురాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

అక్రమ కట్టడాలను ఆపాలి

- ఎస్ఐకి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - ఆలూరు

ఎస్ఐ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న మనేకుర్తి గ్రామస్తులు

ఎలాంటి అనుమతులూ లేకుండా మనేకుర్తి గ్రామంలోని జాతీయ రహదారి 167 స్థలంలో అక్రమ కట్టడాలను ఆపాలని తహశీల్దార్, ఎస్ఐ ఓబులేసుకు శనివారం గ్రామస్తులు రాజశేఖర్, సురేష్, నాగరాజు, దేవేంద్రలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో జాతీయ రహదారిలో ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమంగా విగ్రహ ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆర్అండ్‌బి స్థలంలో అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరారు. స్థానికంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా కొందరు పనిగట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా విగ్రహం కోసం అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. తహశీల్దార్, ఎస్ఐ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి
రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని సిపిఎం నాయకులు గోవిందు, హనుమంతు, గురుశేఖర్, రాముడు కోరారు. శనివారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సాధించలేకపోయిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ భుజాల మీద మోడీ చేతులు మోపి ప్రభుత్వాన్ని నడపాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ఈ పరిస్థితిని మరిచిన మోడీ ప్రభుత్వం సరళీకరణ విధానాలను అమలు చేయడం ఆపడం లేదని విమర్శించారు. ప్రజలు అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. యువతకు ఉద్యోగాల్లేక, కార్మికులకు ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తూ ప్రభుత్వ ఆర్థిక స్థితిని దిగజారుస్తున్నారని మండిపడ్డారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర అమలుకు పూనుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉచిత ఇసుక విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని తెలిపారు. అదనపు చార్జీలను ఇసుకపై రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. సిపిఎం నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, సురేష్, కృష్ణ, నరసింహులు, తిమ్మన్న, ఇస్మాయిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాశక్తి - ఆస్పరి

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సిఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన 3 ట్రాక్టర్లు, యాటకల్లు గ్రామానికి చెందిన 1 ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని పుప్పాలదొడ్డి, వెంగళాయ దొడ్డి గ్రామాల్లోని వాగుల నుంచి అనుమతి లేకుండా ఆదోనికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారంతో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీచ్‌ల దగ్గరకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలన్నారు. వాగులు, వంకల్లో ఇసుక తీసుకుపోవడానికి ఇంటి యజమాని ఆధార్ కార్డు తీసుకొని తహశీల్దార్, పంచాయతీ అధికారితో చలానా కట్టాలని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న ఇసుక ట్రాక్టర్లు

టిడిపిలోకి నూర్ అహ్మద్..?

ప్రజాశక్తి - ఆదోని

అధికార పార్టీలో ఎవరున్నా నియోజకవర్గంలో అధికార కార్యకలాపాల్లో లోపాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసే నాయకునిగా నూర్ అహ్మద్‌కు గుర్తింపు ఉంది. ఆయన త్వరలో పూర్తి కాలం రాజకీయాల్లోకి ప్రవేశించనున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో టిడిపి తరపున ఎమ్మెల్యే సీటు కోసం ఈ ఎన్నికల్లో అధిష్టానం వద్ద గట్టి ప్రయత్నాలు చేసిన ఉపాధ్యాయుడు, ఆదోనిలో విప్లవాత్మక సమాజ సేవకుడు నూర్ అహ్మద్ త్వరలో టిడిపిలో చేరనున్నట్లు సమాచారం. గత 11 ఏళ్లుగా ఆదోనిలో ఆమ్ ఆద్మీ పార్టీ, ఆదోని జిల్లా సమితి వేదికలుగా అవినీతిపై పోరాటం చేస్తూ, ఆదోని ప్రజల సమస్యలు తీర్చేందుకు తన వాణిని అధికారులకు వినిపిస్తూ మీడియాను వేదికగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఆయన టిడిపిలో చేరితే ఆదోనిలో టిడిపి బలీయమైన శక్తిగా మారుతుందని పలువురు అంచనా వేస్తున్నారు. గ్రూపు తగాదాలతో, కూటమి లుకలుకలతో సతమతమవుతున్న టిడిపికి నూర్ అహ్మద్ రాక స్థిరత్వాన్ని, కార్యకర్తలకు భరోసాను ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముస్లిం, మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధిక సంఖ్యలో ఉండడంతో నూర్ అహ్మద్ రాకతో రాజకీయ సమీకరణాలు మారతాయని పేర్కొంటున్నారు. కులమతాలకతీతం గా అందరి కోసం పోరాడే విద్యావంతుడు నూర్ అహ్మద్ అందరినీ కలుపుకుపోయి పార్టీని మరింత బలోపేతం చేస్తారని చెబుతన్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉంటూ గత ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపు కోసం పని చేయడం, టిడిపి జాతీయ నాయకత్వంతో సత్సంబంధాలు ఉండడంతో నూర్ అహ్మద్ రాబోయే రోజుల్లో టిడిపి నాయకునిగా, కర్నూలు జిల్లాలో క్రియాశీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ జిల్లా నాయకత్వం నూర్ అహ్మద్ గురించి ఆరా తీసినట్లు తెలిసింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో కూడా నూర్ అహ్మద్ టచ్‌లో ఉన్నట్లు సమాచారం. త్వరలో టిడిపిలో చేరి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నూర్ అహ్మద్ సేవలు వినియోగించుకుంటున్నట్లు తెలిసింది. పూర్తిస్థాయి రాజకీయాల్లో పాలుపంచుకుంటున్నట్లు, అందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని నూర్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లగా పలుమార్లు పార్టీ పెద్దలను కలిశానని, తన వివరాలను తీసుకున్నారని, అభిప్రాయాలు కూడా తెలిపామన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.

నూర్ అహ్మద్